క్లుప్తంగా...

హజ్ యాత్ర ఎంతో పవిత్రమైనది

నాంపల్లి: హజ్ యాత్ర ఎంతో పవిత్రమైనదని హెచ్.ఇ.హెచ్ ద నిజాం ఏడవ ఖానాజదాన్ అసోసియేషన్ అధ్యక్షుడు నవాబ్ హైదర్ అలీ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన తన నివాసమైన కింగ్‌కోఠిలో హజ్‌కు వెళ్లే యాత్రికులను ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా నవాబ్ హైదర్ అలీ మాట్లాడుతూ.. జీవితంలో ముస్లిం మైనార్టీలు హజ్ యాత్ర ఒక్కసారైనా చేయాలని పేర్కొన్నారు. మక్కాకు వెళ్లే యాత్రికులు మన దేశం సుభిక్షంగా ఉండేలా ప్రార్థనలు చేయాలని కోరారు. అనంతరం యాత్రికులకు వీడ్కోలు పలికి ఆశీస్సులు అందుకున్నారు.

హోంమంత్రిని కలిసిన బీఆర్ఎస్ నేతలు



చార్మినార్: హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీని మర్యాదపూర్వకంగా కలిసి పాతబస్తీలో పార్టీ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును వివరించినట్లు బీఆర్ఎస్ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి పుస్తే శ్రీకాంత్ తెలిపారు. పురానాపూల్ డివిజన్ కాన్‌టెస్టెడ్ కార్పొరేటర్ పెండ్యాల లక్ష్మన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు గోపీగౌడ్ తదితరుల బృందం రాష్ట్ర సచివాలయంలో ఆయనను కలిసి వివరించినట్లు తెలిపారు.

ప్రత్యేక పూజలు



గోల్కొండ: రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సోమవారం కార్వాన్‌లోని శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు కురకుల కృష్ణ, చంటిబాబు, రఘుపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, చంద్రకాంత్, గిరి తదితరులున్నారు.

గోషామహల్ నలుమూలలా అభివృద్ధి పనులు



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. బషీర్‌బాగ్ ఆదర్శ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన రాక్ గార్డెన్‌ను కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆదర్శ్‌నగర్‌తో పాటు నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీలు, మురికివాడలు, అన్ని ప్రాంతాలలో మౌలిక వసతుల రూపకల్పనకు అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ్‌నగర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పాషా ఖాద్రీ, కార్పొరేటర్ సమీనా బేగం

యాకుత్‌పురా: వర్షాకాలంలో ప్రజలకు వరద నీటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ తెలిపారు. తలాబ్‌చంచలం డివిజన్‌లో సోమవారం ఆయన కార్పొరేటర్ సమీనాబేగంతో కలిసి నషేమాన్‌నగర్, సిద్దిఖీనగర్, చాచా గ్యారేజీ ప్రాంతాల్లో పర్యటించారు. బస్తీల్లో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది వర్షాలకు నెలకొన్న సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పర్యటనలో మజ్లిస్ పార్టీ అమన్‌నగర్-బి ఏరియా కమిటీ అధ్యక్షులు మహ్మద్ మోహీనుద్దీన్, నాయకులు మహ్మద్ జాఫర్, జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ బసవరాజు, డీఈ ఏకాంబరం, ఏఈ రవిచంద్, జలమండలి, టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

హరితోత్సవం

- వాడవాడలా హరితహారం
- పెద్ద ఎత్తున మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు అధికారులు, నాయకులు



మొక్కలు నాటుతున్న డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీ పూర్ణచందర్

సుల్తాన్‌బజార్: మొక్కలు నాటడం వల్ల భవిష్యత్తు తరాలకు ఎంతో మేలు చేకూరుతుందని జాంబాగ్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో జాంబాగ్ డివిజన్‌లో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ హాజరై మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. మొక్కలు నాటడం వల్ల భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. శ్రీనివాస్‌యాదవ్, శైలేందర్‌యాదవ్, మయూర్, నితిన్, ఆనంద్‌జైన్, బాల్‌రాజు, రామకృష్ణ, జగపతి తదితరులు పాల్గొన్నారు.

ఏడుగుళ్ల పోచమ్మ ఆలయం వద్ద..

నాంపల్లి: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నాంపల్లి నియోజకవర్గంలోని ఏడుగుళ్ల పోచమ్మ ఆలయం వద్ద తెలంగాణ హరితోత్సవాన్ని నిర్వహించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ ఎంఎస్.ప్రభాకర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాంపల్లి ఇన్‌చార్జి సీహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఇన్కెషాప్ అలీ, అర్బన్ ఫారెస్ట్ సబ్ ఇన్‌స్పెక్టర్ భూలక్ష్మి, నోడల్ ఆఫీసర్ జ్యోతి, బీఆర్ఎస్ నేతలు అశ్విన్ మార్గం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..

చాంద్రాయణగుట్ట: మానవాళి మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఫలక్‌నుమా ఏసీపీ షేక్ జహంగీర్ అన్నారు. జంగమ్మెట్‌లోని చంద్రికాపూర్ జీబీపీఎస్ పాఠశాల ఆవరణలో సోమవారం మొక్కలను నాటారు. ఈ సదర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..వాయు కాలుష్యానికి చెక్ పెట్టేందుకు మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, రవీంద్రనాయక్ నగర్ కాలనీ అధ్యక్షుడు ఎ.కృష్ణా నాయక్, డిప్యూటీ ఐఓఎస్ రామ్మోహన్, ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సరోజినిదేవి కంటి ఆస్పత్రిలో..

గోల్కొండ: మొక్కలు నాటడం ప్రతిఒక్కరూ జీవితంలో ఒక భాగంగా అలవాటు చేసుకోవాలని సరోజినిదేవి కంటి ఆస్పత్రి డాక్టర్ వి. రాజలింగం అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ నజాఫీతోపాటు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలభైరవ హనుమాన్ ఆలయం వద్ద..

చార్మినార్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జరిగిన హరితహారం సందర్భంగా పాతబస్తీ హుస్సేనీఆలం రోడ్డులోని కాలభైరవ హనుమాన్ ఆలయం వద్ద ఉన్న ఓ పాఠశాలలో సంఘసేవకులు, గోల్డ్‌మెన్ మక్కర్ యాదవ్ స్థానిక విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి..

అబిడ్స్: పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం బేగంబజార్ పోలీస్టేషన్‌లో హరితహారం నిర్వహించారు. డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీ పూర్ణచందర్ మొక్కలు నాటారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. పర్యావరణం పట్ల విద్యార్థులకు చిన్నప్పటి నుంచే మక్కువ కలిగే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అబిడ్స్ డివిజన్ ఏసీపీ పూర్ణచందర్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

ఉస్మానియా వైద్య కళాశాలలో..

సుల్తాన్‌బజార్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉస్మానియా వైద్య కళాశాలలో హరితహారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళారెడ్డి, అధ్యాపక బృందం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మానవ మనుగడకు మొక్కలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయ, డాక్టర్ కిరణ్మయి, ఆచార్యులు డాక్టర్ జానకి, డాక్టర్ సుమలత, డాక్టర్ పద్మవతి, డాక్టర్ కవిత, ఎంపిహెచ్‌ఓలు వేణుగోపాల్ గౌడ్, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ శశికళారెడ్డి, అధ్యాపక బృందం



హరితహారంలో కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ తదితరులు



మొక్కలను నాటుతున్న ఫలక్‌నుమా ఏసీపీ షేక్ జహంగీర్



ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న డాక్టర్ రాజలింగం



మొక్కలు నాటుతున్న ఎంఎస్.ప్రభాకర్



మొక్కలు నాటుతున్న గోల్డ్‌మెన్ మకర్ యాదవ్

పార్కులకు కొత్త సొబగులు



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని పార్కులకు కొత్త అందాలు సంతరించుకుంటున్నాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన సాలార్జంగ్ కాలనీ పార్కులో కొత్తగా ఏర్పాటు చేసిన వివిధ రకాల పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కులో పచ్చని అందాలను పెంచేందుకు బల్దియా ఉద్యానవనశాఖ అధికారులతో కలిసి ప్రణాళిక రూపొందించామని, ఇందులో భాగంగానే అన్ని పార్కుల్లో ఔషధ గుణాలు గల మొక్కలతో పాటు వివిధ రకాల మొక్కలు నాటుతున్నామన్నారు. మార్నింగ్ వాకర్ కోసం ప్రతి పార్కులో ప్రత్యేకంగా వాక్‌వే నిర్మించామన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, స్థానిక నాయకులు డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్, ఎజాజ్ అహ్మద్ తదితరులున్నారు.

బోనాలకు తగిన ఏర్పాట్లు



చార్మినార్: బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని పాతబస్తీలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాతో పాటు ఎక్కడ మురుగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటామని జలమండలి సర్కిల్-1 జనరల్ మేనేజర్ కృష్ణ అన్నారు. సోమవారం చార్మినార్ సర్దార్ మహల్ రోడ్డులోని హనుమాన్ టెంపుల్ తదితర పరిసరాల్లో ఆయన సంబంధిత డీజీఎం కిషోర్‌తో కలిసి పర్యటించారు. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి ప్యారసాని వెంకటేష్ పరిసరాల ప్రాంతాల్లో స్థానికులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలతో అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు రూట్‌ను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలో తాగునీటి సమస్యలు లేకుండా ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామన్నారు.

బోనాలకు అందరి సహకారం అవసరం



గోల్కొండ: గోల్కొండ కోటలో జరిగే బోనాలు శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని నగర అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్ అన్నారు. గోల్కొండ కోట బోనాల ఏర్పాట్లు, ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడానికి సోమవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట బోనాలకు బందోబస్తు ఏర్పాట్లు చేయడం పోలీసులకు సవాల్లాంటిదని, బోనాల ఉత్సవాలు జరిగే రోజుల్లో కొండపై జరిగే బోనాలకు భారీ సంఖ్యలో భక్తులు వస్తారన్నారు. ఉత్సవంలో ఎటువంటి అపశృతులు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నామని, దీనికి పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు కూడా తమ సంపూర్ణ సహాయ సహకారాలు సైతం అందిస్తున్నారన్నారు. సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి జీవన్ సింగ్, మైత్రి కమిటీ సభ్యులు ఇలియాస్ అలీ, ఆబెద్, ఆజమ్ ఖాన్ పాల్గొన్నారు.

న్యూట్రీషన్ కిట్ల పంపిణీ



కిట్ల పంపిణీలో పాల్గొన్న శ్వేతా మహంతి

దూద్‌బౌలి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య శాఖలో మహిళల సంక్షేమాని విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందని వైద్య, ఆరోగ్య, శిశు సంక్షేమ శాఖ కమిషనర్, ఐఏఎస్ అధికారి శ్వేతా మహంతి అన్నారు. సోమవారం పేట్లబురుజులోని ప్రభుత్వ ఆధునిక ప్రసూతి ఆసుప్రతిలో గర్భిణులకు న్యూట్రీషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ న్యూట్రీషన్ల కిట్ల ద్వారా మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని.. పుట్టబోయే బిడ్డ, తల్లి ఆరోగ్యంగా ఉండేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ మాలతి మాట్లాడుతూ.. పేట్లబురుజు ప్రభుత్వ ఆధునీక ప్రసూతి ఆసుపత్రిలో గతంలో కంటే ప్రసవాల సంఖ్య పెరిగాయని.. ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నామని.. ఈ న్యూట్రీషన్ కిట్లు మహిళలకు పౌష్టికంగా ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ జైన్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

31వ నేషనల్ కరాటే డో చాంపియన్‌షిప్ పోటీలకు ఎన్నిక



జియాగూడ: తెలంగాణ స్పోర్ట్స్ తెలంగాణ కరాటే డో అసోసియేషన్ ఆల్ ఇండియా కరాటే డో ఫెడరేషన్ ద్వారా జరిగిన పోటీల్లో 18 మంది కరాటే క్రీడాకారులు సెమీ ఫైనల్‌కు ఎన్నికయ్యారు. వీరంతా న్యూఢిల్లీ తాల్ కటోరా స్టేడియంలో జరిగే ఫైనల్ చాంపియన్‌షిప్ పోటీలకు హాజరవుతున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.కె.బాలాజీ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 31వ నేషనల్ కరాటే డో చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 21 నుంచి 23 వరకు ఢిల్లీలో కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల జియాగూడ ఏకే భవన్ ఆటస్థలంలో నిర్వహించిన పోటీల్లో జియాగూడకు చెందిన శాంతినగర్ శ్లోకా ది స్కూల్, జియాగూడ, రహింపురా రిలయన్స్ హైటెక్ స్కూల్ విద్యార్థులు కరాటే పోటీల్లో గెలుపొంది ఫైనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా శ్లోకా ది స్కూల్ కరాటే క్రీడాకారుడు విష్ణుపటేల్, ఇతర క్రీడాకారులను స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు వారిని ఘనంగా సన్మానించి స్పోర్ట్స్ ట్రాక్‌లను అందజేశారు.

పాతబస్తీలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి



చార్మినార్: చార్మినార్ శాసన సభ నియోజకవర్గంలోని ప్లే గ్రౌండ్‌లలో క్రీడాకారుల సౌకర్యార్థం తగిన ఆట వస్తువులతో పాటు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వినతి పత్రం అందజేసినట్లు చార్మినార్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ తెలిపారు. మొగల్‌పురా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల రాధాకృష్ణతో కలిసి మంత్రికి పాతబస్తీలో పార్కుల పరిస్థితులతో పాటు ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చామన్నారు. రోడ్ల మరమ్మతులతో పాటు స్పోర్ట్స్ కిట్లను అందజేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

సన్మానం



అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ ఎకనామిక్ కమిటీకి నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి ఘనంగా సత్కరించారు. పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాశంకర్‌తో పాటు పలువురు నాయకులు, సొసైటీ సభ్యులు వారిని సత్కరించి అభినందించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ గంగాధర్‌రావు, ఉపాధ్యక్షుడు ఆదిత్యమార్గం, కార్యదర్శి జీవీ రంగారెడ్డి, జాయింట్ సెక్రటరీ ధీరజ్‌కుమార్ జైస్వాల్, కోశాధికారి డాక్టర్ వంశీతిలక్, మేనేజింగ్ సభ్యులు బి.సురేందర్‌రెడ్డి, అనిల్‌స్వరూప్ మిశ్రా, వరుణ్ వనం, ఆల్తాఫ్ హుస్సేన్, సర్దార్ జస్పాల్ సింగ్‌ను ఘనంగా సత్కరించారు.

మున్నూరు కాపులకు రూ.లక్ష రుణాలు వర్తింపజేయాలి



చార్మినార్: బీసీ సామాజిక వర్గానికి చెందిన మున్నూరు కాపులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసే లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర మున్నూరు కాపు చార్మినార్ నియోజకవర్గం అడ్ హక్ కమిటీ సభ్యులు పుప్పాల రాధాకృష్ణ పటేల్ కోరారు. ఈ మేరకు బహదూర్‌పురా తహసీల్దార్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో నాయకులు మణికొండ విజయ్‌కుమార్ పటేల్, కొండెం రాకేష్ పటేల్ తదితరులున్నారు.

ప్రేమ జంటపై దాడి.. నలుగురి అరెస్ట్

లంగర్‌హౌస్: రోడ్డుపై నడిచి వెళ్తున్న ప్రేమ జంటపై నలుగురు యువకులు దాడి చేసిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండలో నివాసముండే రెండు వేర్వేరు వర్గాలకు చెందిన అమ్మాయి, అబ్బాయి లంగర్‌హౌస్ చౌరస్తాలో శనివారం రాత్రి నడిచి వెళ్తున్నారు. ఆ సమయంలో లంగర్‌హౌస్‌కు చెందిన ఖలీల్ వారిని ఆపి వారి వివరాలు అడిగాడు. అనంతరం ఖలీల్ తన స్నేహితులకు ఫోన్ చేసి పిలిపించాడు. తమ వర్గం అమ్మాయితో తిరుగుతావా అంటూ నలుగురు కలిసి ఆ అబ్బాయిని చితకబాదారు. వారి నుంచి తప్పించుకున్న బాధితుడు కూతవేటు దూరంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లోకి పరుగు తీశాడు. అక్కడ నుంచి పారిపోయిన నిందితులు ఖలీల్, అబ్దుల్, మిర్జా, ఇమ్రాన్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.

త్వరలోనే అర్హులకు షాపుల కేటాయింపు



మాట్లాడుతున్న మంత్రి తలసాని, ఇన్‌చార్జ్ నందకిశోర్‌వ్యాస్ బిలాల్

అబిడ్స్: బేగంబజార్‌లో నూతనంగా నిర్మించిన ఫిష్ మార్కెట్‌లో త్వరలోనే అర్హులకు షాపులను కేటాయిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ లోపు దాదాపు ప్రక్రియ పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం బేగంబజార్ ఫిష్ మార్కెట్‌ను మంత్రి తలసాని సందర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గోషామహల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్‌తో కలిసి త్రిమెన్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, బీఆర్ఎస్ నేతలు గడ్డం శ్రీనివాస్ యాదవ్, ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్, ధన్‌రాజ్, పూజవ్యాస్ బిలాల్, కార్పొరేటర్ శంకర్‌యాదవ్, జోనల్ కమిషనర్ రవికిరణ్, మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరామ్ బుక్కియా, మత్స్యశాఖ అధికారిణి చరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూలై 7 నుంచి అక్కన్న మాదన్న అమ్మవారి బోనాలు

యాకుత్‌పురా: హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న ఆలయంలో మహంకాళీ జాతర బోనాల ఉత్సవాలను జులై 7వ తేదీ నుంచి ప్రారంభించనున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు రాందేవ్ అగర్వాల్ తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లుపై సోమవారం ఆలయ ప్రార్థన మందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ 75వ వజ్రోత్సవ సందర్భంగా ఈ ఏడాది ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జులై 7 నుంచి 18వ తేదీ వరకు వార్షిక బోనాల ఉత్సవాలను జరపనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రాజరత్నం, డాక్టర్ భరత్ ప్రకాష్, సతీష్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

కట్టుకున్నోడే కడతేర్చాడు !

- వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ
- అడిగినప్పుడల్లా డబ్బులు ఇవ్వకపోవడంతోనే ఘాతుకం
- తండ్రి వద్ద తల్లి సెల్‌ఫోన్ ఉండడంతో అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన కూతురు

చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో ఈనెల 15న చోటు చేసుకున్న మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. అడిగినప్పుడల్లా డబ్బులు ఇవ్వకపోవడంతోనే ఆమె భర్తే దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. చౌటుప్పల్‌లోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏసీపీ మొగిలయ్య కేసు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలోని మీరాలంమండి జగ్జీవన్‌నగర్‌కు చెందిన తోకల నగేష్‌కు శోభ(39)తో 19 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండేళ్ల క్రితం లక్కారం గ్రామానికి వచ్చారు. అక్కడే అద్దె ఇంట్లో ఉంటున్నారు. నగేష్ పాత టైర్ల వ్యాపారం చేస్తుండగా, శోభ లింగోజిగూడెం గ్రామంలోని దివీస్ పరిశ్రమంలో స్వీపర్‌గా పనిచేస్తోంది. చిన్న కుమార్తె హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతుండగా, పెద్దకుమార్తె మీర్ ఆలంమండిలోని ఇంటి వద్ద ఉంటోంది.

ఆర్థిక సమస్యలు తలెత్తడంతో..

నగేష్‌కు వ్యాపారం సరిగా సాగకపోవడంతో ఆర్థిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఖర్చులకు భార్యను డబ్బులు అడిగేవాడు. కానీ అడిగిన ప్రతిసారీ డబ్బులు ఇవ్వకపోవడంతో ఆమెపై కోపం పెంచుకున్నాడు. అందులో భాగంగా ఈనెల 15న భార్యతో గొడవపెట్టుకున్నాడు. ఆగ్రహంతో ఆమె మెడకు టవల్‌తో బిగించాడు. చేతితో గొంతు పిసికాడు. కాలుతో గొంతు నొక్కి హత్య చేశాడు. అనంతరం మీరాలంమండిలోని ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు కుమార్తె ప్రసన్న తల్లి సెల్‌కు ఫోన్ చేయగా ఇంట్లోనే ఉన్న తన తండ్రి ద్విచక్రవాహనంలో ఫోన్ రింగ్ అయ్యింది. దీంతో అమ్మ ఫోన్ నీ వద్ద ఎందుకు ఉందని తండ్రిని ప్రశ్నించింది. పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో అతన్ని అనుమానించింది. ఇదే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అందులో భాగంగా సోమవారం మీరాలంమండిలోని తన ఇంట్లో ఉన్న నగేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ ఎస్.దేవేందర్, ఎస్ఐ యాదగిరి, సిబ్బంది ఉన్నారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సీఐ దేవేందర్‌ను ఏసీపీ అభినందించారు.